క్లుప్తంగా

సబ్‌స్టేషన్ మంజూరు

నాగర్‌కర్నూల్: మున్సిపల్ పరిధిలోని ఉయ్యాలవాడలో రూ.2.66 కోట్లతో కొత్త సబ్ స్టేషన్ మంజూరు చేస్తూ అందుకు సంబంధించిన జీఓను శనివారం విడుదల చేశారు. గ్రామస్తులు ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

రేపు కొనుగోలు కేంద్రం ప్రారంభం

ఉప్పునుంతల: మండల కేంద్రంలోని పీఏసీఎస్ గోదాం వద్ద 3న ఉదయం 10 గంటలకు వేరుశనగ కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ ప్రారంభిస్తారని పీఏసీఎస్ చైర్మన్ సత్తు భూపాల్‌రావు, సీఈఓ రవీంద రావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం (పీఏసీఎస్) ఆధ్వర్యంలో టీజీ మార్క్‌ఫెడ్, ఎన్‌సీసీఎఫ్ వారి సహకారంతో ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

మొక్కల పరిరక్షణకు చర్యలు

తాడూరు: ఎండాకాలంలో మొక్కల పరిరక్షణకు చర్యలు తీసుకుంటున్నట్లు ఎంపీడీఓ ఆంజనేయులు అన్నారు. శనివారం మండల కేంద్రంతో పాటు ఇంద్రకల్, యాదిరెడ్డిపల్లి గ్రామాల్లో ఆయన నర్సరీలను పరిశీలించారు. జూన్, జూలై వరకు మొక్కలను సిద్ధం చేయాలని సిబ్బందికి సూచించారు. ఎండలు తీవ్రమవుతున్న కారణంగా మొక్కలు ఎండిపోకుండా ప్రతిరోజు నీరు అందించాలన్నారు. నర్సరీల నిర్వాహకులకు మొక్కల పెంపకం, పిచ్చి గడ్డి తొలగించే విధానంపై అవగాహన కల్పించారు. సిబ్బంది, నిర్వాహకులు ఉన్నారు.

డిప్యూటీ తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరణ

వెల్దండ: మండల డిప్యూటీ తహసీల్దార్‌గా కిరణ్‌కుమార్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేసిన శ్రీను కల్వకుర్తి ఆర్డీఓ కార్యాలయానికి బదిలీ అయ్యారు. ఆర్డీఓ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న కిరణ్‌కుమార్ వెల్దండ డిప్యూటీ తహసీల్దార్‌గా వచ్చారు.

మల్లన్నను సస్పెన్షన్ చేయడం సరికాదు

కల్వకుర్తి రూరల్: కాంగ్రెస్ పార్టీ నుంచి తీన్మార్ మల్లన్నను సస్పెన్షన్ చేయడం సరికాదని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నకినమోని పెద్దయ్య యాదవ్ అన్నారు. శనివారం పట్టణంలోని ఆ సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీల సమస్యలపై గళం ఎత్తితే సస్పెండ్ చేస్తారా అని ప్రశ్నించారు. బీసీలను చిన్న చూపు చూడటం కాంగ్రెస్‌పార్టీకి తగదన్నారు. గతంలో పీసీసీ అధ్యక్షుడిగా ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి ఉన్నప్పుడు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, రాజగోపాల్ రెడ్డి, ఉత్తంకుమార్ రెడ్డి తీవ్రమైన వ్యాఖ్యలు చేసిన చర్యలు తీసుకోలేదు గుర్తుచేశారు. మల్లన్న బీసీ కావడం వల్లే ఆయనపై చర్యలు తీసుకున్నారని ఆరోపించారు.

సీసీ రోడ్ల నిర్మాణ పనులు ప్రారంభం



తాడూరు: మండలంలోని పాపగల్ దళితవాడలో అసంపూర్తిగా వదిలేసిన సీసీరోడ్ల నిర్మాణ పనులను శనివారం మాజీ సర్పంచ్ నారాయణ ప్రారంభించారు. ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి సహకారంతో పనులు చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు. మాజీ ఎంపీటీసీ రమేష్, కాంగ్రెస్ నాయకులు తాహీర్, లింగం, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

హైమాస్ట్ లైట్ల ఏర్పాటు

తాడూరు: మండల కేంద్రంలోని రెండో వార్డులో హైమాస్ట్ లైట్లను శనివారం ఏర్పాటు చేశారు. గతంతో వార్డువాసులు కాలనీలో హైమాస్ట్ లైట్లు వెలగటం లేదని ఎంపీడీఓ ఆంజనేయులు దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు ఆయన స్పందించి మొత్తం ఐదు లైట్లను ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారు. ఎంపీడీఓకు వార్డువాసులు కృతజ్ఞతలు తెలిపారు.

రైతులకు అవగాహన



బల్మూర్: మండలంలోని తుమ్మెన్‌పేట వేరుశనగ కొనుగోలు కేంద్రంలో శనివారం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి నరేష్‌కుమార్ రైతులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. టీజీ మార్క్‌ఫెడ్, నాఫెడ్–ఎన్‌సీసీఎఫ్ ఆధ్వర్యంలో ప్రభుత్వం కనీస మద్దతు ధర క్వింటాల్‌కు రూ.6783 నిర్ణయించినట్లు వివరించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ నర్సయ్యయాదవ్, సీఈఓ రాజవర్ధన్‌రెడ్డి, డైరెక్టర్లు, ఏఈఓలు, రైతులు పాల్గొన్నారు.

సృజనాత్మకతతో బోధించాలి



మాట్లాడుతున్న డీఈఓ రమేష్‌కుమార్

కందనూలు: బోధనలో మూస పద్ధతికి స్వస్తి పలికి సృజనాత్మకంగా బోధించాలని డీఈఓ రమేష్‌కుమార్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గతేడాది అక్టోబర్‌లో డీఎస్సీ ద్వారా నియామకమైన నూతన ఉపాధ్యాయులకు మూడు రోజుల శిక్షణ కార్యక్రమంలో భాగంగా రెండో రోజు గణితం, పరిసరాల విజ్ఞానం సబ్జెక్టుపై శిక్షణ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా డీఈఓ రమేష్‌కుమార్ హాజరై మాట్లాడారు. విద్యార్థులలో కనీస విద్యాసామర్థ్యాలను మెరుగుపర్చాలన్నారు. అదేవిధంగా పదో తరగతి విద్యార్థులకు జీవశాస్త్రంలో ఎవాల్యూషన్ అంశాన్ని బోధించారు. కార్యక్రమంలో అకడమిక్ మానిటరింగ్ అధికారి షర్ఫుద్దీన్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సిద్దిక్ అహ్మద్, రిసోర్స్ పర్సన్స్ లక్ష్మీనరసింహరావు, నెహ్రూప్రసాద్, మణికంఠ శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు



అష్టోత్తర శతకలశస్నపన నిర్వహిస్తున్న వేద పండితులు

వెల్దండ: మండలంలోని గుండాల అంబా రామలింగేశ్వరస్వామి దేవాలయంలో బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. శనివారం భక్తులు స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. మహాపూర్ణాహుతి, ఏకాదశ రుద్రాభిషేకంతో పాటు అష్టోత్తర శతకలశస్నపన, ప్రాతరౌపాసన, రుద్రహవనం, మూలమంత్ర హవనములను నిర్వహించారు. అష్టదిగ్బలి, అన్న బలిహరణ, త్రిశూలస్నానం, స్వస్తివచనం వంటి పూజా కైంకర్యాలు ఏర్పాటు చేశారు. సత్యనారాయణ స్వామి వ్రతాలను ఆచరించారు. కార్యక్రమంలో ఈఓ ప్రసాద్, నాయకులు పర్వత్‌రెడ్డి, అర్చకులు, దేవాలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థి కుటుంబాన్ని ఆదుకోవాలి



మాట్లాడుతున్న యాదగిరి

వెల్దండ: గుండాల దేవాలయ ఆవరణంలోని కోనేరులో గల్లంతై మృతి చెందిన ఓమేష్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని బీజేపీ మండల అధ్యక్షుడు యాదగిరి డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. శివరాత్రికి భక్తులు అధిక సంఖ్యలో రావడంతో పాలకమండలితో పాటు ఎండోన్‌మెంట్ అధికారులు ఏర్పాట్లల్లో నిర్లక్ష్యం కారణంగా విద్యార్థి మృతి చెందినట్లు ఆరోపించారు. కోనేరులో స్నానాలు చేసేందుకు భక్తులు మెట్ల వెంబడి కాకుండా కోనేరు చుట్టు వెళ్లడంతో అదే విధంగా త్వరగా స్నానం చేసేందుకు విద్యార్థులు వెళ్లారన్నారు. బాధిత కుటుంబానికి దేవాదాయశాఖ రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు. నాయకులు రామస్వామి, రాజేందర్‌రెడ్డి, శ్రీశైలం, విష్ణుగౌడు, పాండు, వెంకటేష్, యాదగిరి, లక్ష్మయ్య, గణష్, శ్రీశైలం ఉన్నారు.

మున్సిపాలిటీ షెడ్లను స్థానికులకే కేటాయించాలి



షెడ్లను పరిశీలిస్తున్న నాయకులు

కల్వకుర్తి రూరల్: పట్టణంలోని జూనియర్ కళాశాల ఎదురుగా చిరు వ్యాపారుల కోసం నిర్మించిన పుట్‌పాత్ షెడ్లను స్థానికులకు కేటాయించాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు బాబీ దేవ్ డిమాండ్ చేశారు. శనివారం ఆయన పుట్‌పాత్‌లను సందర్శించారు. నాలుగు సంవత్సరాల కిందట నిర్మించిన షెడ్లను వీధి వ్యాపారులకు కేటాయించకుండా నిర్లక్ష్యం చేశారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 15 నెలలు గడుస్తున్న షెడ్లను ఇవ్వలేదన్నారు. 40 సంవత్సరాలు కళాశాల చుట్టూ వ్యాపారాలు నిర్వహించుకున్న చిరు వ్యాపారులకు మొదటి ప్రాధాన్యం, స్థానికులకు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో సీనియర్ నాయకుడు రామచంద్రారెడ్డి, రాంభూపాల్ రెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు దుర్గాప్రసాద్, రాఘవేందర్ గౌడ్, కృష్ణగౌడ్, నరేడ్ల శేఖర్ రెడ్డి, వివేకానంద, సురేందర్ గౌడ్, రాజశేఖర్, లక్ష్మీనరసింహ, అరవింద్ రెడ్డి, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

బాలకార్మిక వ్యవస్థను నిర్మూలిద్దాం



లింగాల: బాలకార్మిక వ్యవస్థ, బాల్య వివాహాల నిర్మూలనకు అందరూ సహకరించాలని పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ కోరారు. శనివారం లింగాల గ్రామ పంచాయతీ కార్యాలయంలో అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యదర్శి మాట్లాడుతూ 18 సంవత్సరాల వయస్సులోపు పిల్లలను జ్యూస్ సెంటర్లు, టీ స్టాల్స్, వాటర్ సర్వీసింగ్ సెంటర్లు, కిరాణం, ఇతర వ్యాపార సంస్థలలో పని చేయించుకుంటే యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. సింగిల్ విండో డైరెక్టర్ శంకర్‌నాయక్, శ్రీనివాస్ యాదవ్ పాల్గొన్నారు.

మొక్కల సంరక్షణ అందరి బాధ్యత



పెంట్లవెల్లి: మొక్కల సంరక్షణ అందరి బాధ్యత అని ఎంపీడీఓ దేవేందర్ పేర్కొన్నారు. శనివారం మండలంలోని మాధవస్వామినగర్‌లో నర్సరీని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ నర్సరీలో ఉన్న ప్రతి మొక్కను బతికించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ దేవేందర్, టెక్నికల్ అసిస్టెంట్ మోహన్‌కృష్ణ, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

బరువు తక్కువ ఉన్న పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ

వీపనగండ్ల: మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో శనివారం బరువు, ఎత్తు తక్కువగా ఉన్న పిల్లల గుర్తింపు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో బరువు తక్కువ ఉన్న చిన్నారులకు పంచాయతీ కార్యదర్శి రమేష్‌రెడ్డి పౌష్టికాహారం అందించారు. బరువు, ఎత్తు తక్కువగా ఉన్న పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని అంగన్‌వాడీ టీచర్లకు సూచించారు.

భీందీక్ష సభను విజయవంతం చేయండి

తెలకపల్లి: భీందీక్ష సభను విజయవంతం చేయాలని స్వేరోస్ జిల్లా జాయింట్ సెక్రెటరీ మిద్దె ధర్మరాజు అన్నారు. శనివారం మండల కేంద్రంలో స్వేరోస్ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 15 నుంచి నెల రోజుల పాటు స్వేరోస్ ఆధ్వర్యంలో భీందీక్షను చేపడుతున్నామన్నారు. ఖమ్మం జిల్లా నెలకొండ పల్లిలో నిర్వహించే భీందీక్ష ప్రారంభ సభకు జిల్లా నుంచి వేలాది తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. రెడ్డపాకుల శివశంకర్, సంపత్ కుమార్, రమేష్, శ్రీకాంత్, రేణయ్య, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉపాధ్యాయులైన వేళ..!



ఉప్పునుంతల బాలుర ప్రాథమిక పాఠశాలలో ..

సాక్షి, నెట్‌వర్క్: నాగర్‌కర్నూల్ జిల్లాలోని పలు మండలాల్లో శనివారం పలు పాఠశాల విద్యార్థులు స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహించారు. ఉప్పునుంతల మండలంలోని బాలుర ప్రాథమిక పాఠశాల, వెల్దండ మండల పరిధిలోని లింగారెడ్డిపల్లి ప్రాథమిక పాఠశాల, అమ్రాబాద్ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల, కోడేరు పస్పుల ప్రాథమిక పాఠశాల, తాడూరు మండల కేంద్రంలో ఎంపీపీ పాఠశాలలో విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. కార్యక్రమంలో ఉప్పునుంతల ఎంఈఓ చంద్రశేఖర్ వెల్దండ ఇన్‌చార్జ్ ఎంఈఓ చంద్రుడు, అమ్రాబాద్ ఎంఈఓ బాలకిషన్, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎల్‌ఆర్‌ఎస్‌పై హెల్ప్‌డెస్క్ ఏర్పాటు

కల్వకుర్తి టౌన్: అనుమతులు లేని లేఅవుట్లలోని ప్లాట్ల క్రమబద్ధీకరణకు సంబంధించి ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల ఫీజులను చెల్లించేందుకు మున్సిపల్ కార్యాలయంలో హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేసినట్లుగా మున్సిపల్ కమిషనర్ మహమూద్ షేక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎల్‌ఆర్‌ఎస్ ఫీజును చెల్లించాలని ఇప్పటికే పలువురు దరఖాస్తులకు కార్యాలయం నుంచి సమాచారం అందిందని, వారంతా మార్చి 31వ తేదీలోపు చెల్లిస్తే వారికి 25 శాతం రాయితీ ప్రభుత్వం అందిస్తుందన్నారు. దరఖాస్తులపై ఎలాంటి ఫిర్యాదులు ఉన్నా, ఏవైనా సందేహాలు ఉన్నా హెల్ప్‌డెస్క్‌లో సంప్రదించి నివృత్తి చేసుకోవాలని కోరారు.

ఆర్థికసాయం అందజేత



వెల్దండ: మండలంలోని శంకరకొండతండాకు చెందిన నేనావత్ ధర్మనాయక్ హైదరాబాదులో గచ్చిబౌలిలో కారు నడుపుతో అకస్మాత్తుగా గుండెపోటుతో మృతి చెందాడు. శనివారం మారుతి క్యాబ్ డ్రైవర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బాధిత కుటుంబానికి రూ.28వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో పవన్, తిరుపతి, సంతోష్‌నాయక్, జయేందర్, సతీష్‌గౌడు, సీతారాం, సోమనాథ్, సురేష్, రాఘు, గోపాల్, సందీప్, శ్రీశైలం, సురేష్, ఉమేష్, శ్రీను, వెంకటేష్ ఉన్నారు.

ఎక్సైజ్ అధికారుల దాడులు



వెల్దండ: మండలంలోని కల్యాణ్‌వాగుతండా, రామోజీతండా, బొల్లంపల్లి తండాలో కల్వకుర్తి ఎక్సైజ్ అధికారులు ఆధ్వర్యంలో శనివారం దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా 400 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. 10 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఎక్సైజ్ సీఐ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ సారా తయారు చేసిన, విక్రయించిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో సిబ్బంది జ్యోతి, రఘు, సర్యా, పరశురాము తదితరులు ఉన్నారు.

కోళ్ల అపహరణ

లింగాల: మండలంలోని కోమటికుంటలో వ్యవసాయ పొలంలో పెంచుతున్న 65 కోళ్లను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించిన ఘటన శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. కోళ్ల విలువ రూ.40వేల వరకు ఉంటుందని బాధితుడు దేశమోని కావలి నిరంజన్ తెలిపారు. పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించారు.

ప్రజా సమస్యలపై నిరంతర పోరాటం

పాన్‌గల్: గిరిజన తండాలు, గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం ప్రజలతో కలిసి నిరంతర పోరాటాలు కొనసాగిస్తామని సీపీఎం మండల కార్యదర్శి బాల్యానాయక్ అన్నారు. శనివారం మండలంలోని తెల్లరాళ్లపల్లి తండాలో స్థానిక సమస్యలపై ఇంటింటి సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. పంచాయతీ కార్మికులకు నాలుగు నెలలుగా వేతనాలు అందకపోవడం, వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణకు ముందస్తు చర్యలు చేపట్టకపోవడం దారుణమన్నారు. అన్ని గ్రామాల్లో స్థానిక సమస్యలపై చేపట్టిన సర్వే అనంతరం వాటి పరిష్కారం కోసం ప్రజలతో కలిసి పోరాటాలు సాగిస్తామన్నారు. నాయకులు బాబునాయక్, చిట్టెమ్మ, రవినాయక్ పాల్గొన్నారు.

ఇసుక కొరత లేకుండా చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న అంజనేయులు

కల్వకుర్తి రూరల్: ఇసుక కొరత లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు భాషమోని ఆంజనేయులు డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని భవన నిర్మాణ కార్మిక సంఘం భవనంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు అధ్యక్షతన సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో ఇసుక కొరత ఏర్పడి నిర్మాణ పనులు నిలిచిపోయాయన్నారు. ఆన్‌లైన్ ద్వారా బుక్ చేస్తే వారం వరకు రావడం లేదన్నారు. మండలంలోని తర్నికల్, పంజుగుల గ్రామాలకు ఆన్‌లైన్ రిజిస్టర్ కావడంలేదని కేవలం కల్వకుర్తి మాత్రమే రిజిస్టర్ కావడం ఇబ్బందిగా మారిందన్నారు. సమావేశంలో దర్శన్ రెడ్డి, ప్రభాకర్, యాదయ్య, రాజు గౌడ్, వెంకటయ్య, బొట్టు రాజు పాల్గొన్నారు.

వీసీ ద్వారా నాణ్యత ప్రమాణాల తనిఖీ



నాణ్యత ప్రమణాలను పరిశీలిస్తున్న వైద్య బృందం

తిమ్మాజిపేట: మండలంలోని కోడుపర్తి పల్లె దవాఖానాను గత ప్రభుత్వ హాయంలో నిర్మించిన రాష్ట్ర, జిల్లా వైద్య క్వాలిటీ అధికారుల పరిశీలన చేయలేదు. దీంతో దవాఖాన నిర్వహణకు పూర్తి స్థాయిలో అనుమతి రాలేదు. దీంతో పల్లె దవాఖాన నిర్వహణ అనుమతి కోసం జాతీయ నాణ్యత ప్రమాణాల డిస్ట్రిక్ క్వాలిటీ కన్సల్టెంట్ సంతోష్, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ స్వప్న, ఎంఎల్‌హెచ్‌పీ సూపర్‌వైజర్ మణికుమార్, రవి తదితర అధికారులతో కూడిన వైద్య బృందం వీడియో కాన్ఫరెన్స్ ద్వార నాణ్యత ప్రమాణాలను పరిశీలించారు. నివేదికను జిల్లా వైద్యధికారికి, జిల్లా క్వాలిటీ అధికారికి నివేదిస్తామని వారు తెలిపారు. కార్యక్రమంలో ఫార్మసిస్ట్ బాల్‌రాజ్, ల్యాబ్ టెక్నిషియన్ రాజుగోపాల్, ఏఎన్‌ఎంలు ప్రమీల, నిర్మల ఆశ వర్కర్లు గౌసియా, కళావతి, చంద్రకళ, సాలి, సునీత, వెంకటేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి మంత్రాలమ్మ బ్రహ్మోత్సవాలు

కోడేరు: మండలంలోని జనుంపల్లి శివారులో వెలిసిన షిడే బ్రహ్మోత్సవాలు ఆదివారం ప్రారంభం కానున్నాయి. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఏర్పాట్లు పూర్తి చేశారు. బ్రహ్మోత్సవాలను తిలకించేందుకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల ప్రజలు హాజరు కానున్నారు.

కోర్కెలు తీర్చే కొంగు బంగారం..

జనుంపల్లికి చెందిన పర్లగొర్ల వంశస్తులు తమ గొర్రెలను కర్నూల్ జిల్లా ఆత్మకూర్ మండలం కనుమ అనే అడవుల్లో గొర్రెలను మేపేందుకు తీసుకెళ్లారు. గొర్రెలకు వివిధ రోగాలు సోకి మరణిస్తుండటంతో ఏమి చేయాలో తోచని సదరు కాపరి కలలో అమ్మవారు ప్రత్యక్షమై జనుంపల్లి గ్రామ శివారులో అమ్మవారిని ఏర్పాటు చేయాలని సూచించింది. అతడు గ్రామస్తులతో చర్చించి పర్లగొర్ల వంశస్తులు అమ్మవారిని దేవాలయాన్ని నెలకొల్పారు. ప్రతి ఏడాది శివరాత్రి అనంతరం అమ్మవారికి బ్రహ్మోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందని నిర్వాహకులు తెలిపారు.

జాతరకు ఏర్పాట్లు పూర్తి

భక్తుల సౌకర్యార్థం జాతరలో అన్ని ఏర్పాటు చేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. తాగునీటికి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నామని వివరించారు. అమ్మవారి ఆలయాన్ని ముస్తాబు చేశామని తెలిపారు.

ఆత్మనిర్భరభారత్-అపరాలుపై వెబినార్



తాడూరు: మండలంలోని ఇంద్రకల్ రైతు వేదికలో ఆత్మనిర్భరభారత్–అపరాలు కార్యక్రమంలో భాగంగా కేంద్ర ప్రభుత్వ వ్యవసాయ శాఖ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించింది. వెబినార్‌లో భాగంగా 2025–26 సంవత్సరానికి గాను కేంద్ర ప్రభుత్వం పంటల సాగు, ఉత్పత్తి, ఉత్పాదకత పెంచడానికి గాను కేటాయించిన బడ్జెట్ గురించి, కిసాన్ క్రెడిట్ కార్డ్ ద్వారా పంట రుణాల పరిమితి పెంపును వివరించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి చంద్రశేఖర్, ఎల్‌డీఎం శ్రీనివాస్ రావు, నాగర్‌కర్నూల్ ఏడీఏ వాసు, ఏఓ సందీప్, ఏఈఓలు, రైతులు పాల్గొన్నారు.

ఉద్యోగ కల్పనలో ప్రభుత్వం విఫలం

కొల్లాపూర్: ఉద్యోగ కల్పనలో ప్రభుత్వం విఫలం అయ్యిందని బీఆర్‌ఎస్‌వీ జిల్లా నాయకుడు దారా శేఖర్ అన్నారు. శనివారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టి 15 నెలలు గడుస్తున్నా ఇప్పటివరకు కనీసం 50 వేల ఉద్యోగాలు కూడా భర్తీ చేయలేదన్నారు. జాబ్ క్యాలెండర్ ప్రకారం వెంటనే ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో బీఆర్‌ఎస్‌వీ ఆధ్వర్యంలో పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. నాయకులు జయరాం, మాసూమ్ బాబా, మహ్మద్ సోహైల్, శివ ఉన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

కల్వకుర్తి రూరల్: జాతీయ యువజన, క్రీడా సర్వీసుల శాఖ, నాగర్ కర్నూల్ జిల్లా మై భారత్, స్వామి వివేకానంద శివ బృందం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న యువ ఉత్సవ్ పోస్టర్‌ను జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు హుస్సేన్ నాయక్ ఆవిష్కరించారు. యువతలో ప్రతిభను వెలికి తీసేందుకు చిత్రలేఖనం, కవిత్వం, ఫొటోగ్రఫీ, నృత్యం, సంగీతం, ఉపన్యాస పోటీలు నిర్వహిస్తున్నట్లు స్వామి వివేకానంద సేవ బృందం అధ్యక్షుడు శివ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి పాలమూరు జిల్లా యువజన అధికారి కోట నాయక్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

రైతు సంఘం సభ్యత్వ నమోదు



కొల్లాపూర్: మండలంలోని ముక్కిడిగుండంలో సీపీఎం అనుబంధ తెలంగాణ రైతు సంఘం శనివారం సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. స్థానిక రైతులకు ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బూర్గం బాలవీర్ సభ్యత్వాలను అందజేశారు. కార్యక్రమంలో నాయకులు వెంకట్రాములు, మంతయ్య, బలరాం, లక్ష్మి, సూర్యనాయక్ తదితరులు ఉన్నారు.

కోడేరు: మండల కేంద్రంలో రైతు సంఘం సభ్యత్వ నమోదును శనివారం రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు రైతు భరోసా నిధులు వెంటనే జమ చేయాలన్నారు. కార్యక్రమంలో రాజేష్, బుడ్డయ్య, చెన్నమ్మ, రాములు, వెంకటేష్, సంజన్న, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

మాదిగ అమర వీరులకు నివాళులు



సాక్షి, నెట్‌వర్క్: నాగర్‌కర్నూల్ జిల్లాలోని పలు మండలాల్లో శనివారం ఎస్సీ వర్గీకరణ ఉద్యమంలో ప్రాణాలు అర్పించిన మాదిగ అమర వీరుల సంస్మరణ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కొల్లాపూర్ జగ్జీవన్‌రామ్ చౌరస్తా, తిమ్మాజిపేట అంబేద్కర్ విగ్రహం ఎదుట, అచ్చంపేట పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో ఎమ్మార్పీఎస్, ఎంఈఎఫ్, ఎంఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో, వెల్దండ మండలం ఎమ్మార్పీఎస్, మాదిగల ఐక్య వేదిక ఆధ్వర్యంలో, ఉప్పునుంతల మండలం ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో, పెద్దకొత్తపల్లి, పెంట్లవెల్లి, కోడేరు మండలాల్లో అమరవీరుల చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు సోట ఖాసీం, మంద నర్సింహ మాదిగ, కార్యకర్తలు పాల్గొన్నారు.

వ్యాధి నిరోధక టీకాలు వేయించాలి



మాట్లాడుతున్న సీహెచ్‌ఓ రామయ్య

పాన్‌గల్: చిన్నారులకు సకాలంలో వ్యాధి నిరోధక టీకాలు వేయించేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సీహెచ్‌ఓ రామయ్య సిబ్బందికి సూచించారు. శనివారం మండలంలోని బండపల్లి హెల్త్ సబ్ సెంటర్‌లో వ్యాక్సినేషన్ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చిన్నారులకు సకాలంలో వ్యాధి నిరోధక టీకాలు వేయించడంతో భవిష్యత్‌లో అంటు వ్యాధుల నుంచి రక్షణ పొందవచ్చన్నారు. దీంతో పాటు గర్భిణులకు సకాలంలో మొదటి, రెండవ డోస్ టీటీ వ్యాక్సిన్ వేయాలని సిబ్బందికి సూచించారు. గర్భిణులు వైద్యుల సూచనలు పాటిస్తూ పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. ప్రతి గర్భిణి ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే కాన్పు చేయించుకునేలా సిబ్బంది ప్రత్యేక చొరవ చూపాలన్నారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది రమాదేవి, శైలజ తదితరులు పాల్గొన్నారు.